



# విద్యుత్‌శాఖ యాక్షన్ ప్లాన్..!

-వర్షాకాలం నేపథ్యంలో ముందుస్తు చర్యలు
-విద్యుత్ స్థంబాలు, లైన్లపై స్పెషల్ డ్రైవ్
-చెట్లున్న ప్రాంతాల్లో ఎల్‌టీఏవీ కేబుల్స్ ఏర్పాటు
-సర్కిళ్ల వారిగా కంట్రోల్ రూంలు
-24గంటలు పనిచేందుకు విపత్తు నిర్వహణ బృందాలు

**హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త:** వానాకాలంలో విద్యుత్ సరఫరాలో కలిగేఅంతరాయాలను అధిగమించేందుకు విద్యుత్‌శాఖ సమాయత్తమైంది. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిస్కం ముందుస్తు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. గత అనుభవాలను దృష్ట్యా ఇప్పటికే పటిష్ట చర్యలకు సిద్దమైన అధికారులు విపత్తులను ఎదుర్కొంనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. పాత విద్యుత్ తీగల లైన్లు పునరద్దరణతోపాటు కొత్తవి అందుబాటులోకి తేవటం,చెట్ల కొమ్మలను తొలగించడం, నేలకొరిగిన విద్యుత్ స్థంభాల తొలగింపు వంటి పనులు చేపట్టేదుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. అలాగే విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఒక్కోసర్కిల్ పరిధిలో 6-8కంట్రోల్ రూంలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసేలా డిస్కం ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్దం చేశారు. సీబీడీ (సెంట్రల్ బ్రేక్‌డౌన్ గ్యాంగులు) లైన్ సిబ్బంది 24గంటలు విధుల్లో ఉండేలా షిప్టింగ్ పద్దతులు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ పరికరాల మరమమత్తులకు చేతిగ్లౌజ్‌లు,ఎర్త్‌రాడ్, హెల్మెంట్లు పెద్దసంఖ్యలో స్టోర్లలోస్టాక్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏడీఈ ఆధ్వర్యంలో అన్ని విభాగాలకు చెందిన నలుగురు ఏఈలు కంట్రోల్ రూంకు వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



### చెట్లున్న ప్రాంతాల్లో ఎల్‌టీఏవీ కేబుల్స్...

వర్షాకాలంలో ఏచిన్నగాలి వాన వచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అలాంటి సమస్యలను తగ్గించేందుకు చెట్లు ఉన్నప్రాంతాల్లో 800-1000కిలో మీటర్ల ఎల్‌టిఏవీ (లోటెన్షన్ ఎయిర్‌బంచ్) కేబుల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రేటర్ జోన్‌లో ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈకేబుల్స్‌ను వినియోగిస్తున్న విద్యుత్‌శాఖ నగరవ్యాప్తంగా చెట్లు ఉన్నప్రాంతాల్లో పూర్తిస్థాయి ఏర్పాటు చేయనున్నారు. ఫీడర్లలో ట్రిప్పింగ్,బ్రేక్ డౌన్స్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎల్‌టీఏవీ కేబుల్స్ ఉపయోగపడుతాయని అధికారులు చెబుతున్నారు. వీటి వినియోగంతో విద్యుత్ ప్రమాదాలు జరగవని ఇంజనీర్లు అంటున్నారు. చెట్ల మధ్యలో నుంచి ఎల్‌టీఏవీ కేబుల్స్ ఉన్నా సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తవని చెబుతున్నారు. గతేడాది గాలివానకు చోటు చేసుకున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని చెట్లు ఎక్కువగా ఉన్నప్రాంతాల్లో ఈకేబుల్స్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

### అదనంగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు..

వర్షాకాంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా రిపేర్లు అయ్యే అవకాశాలుండటంతో ఒక్కో సర్కిల్‌లో 50-80 ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా సిద్దం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అంతరాయాలు ఏర్పడితే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. చెట్లు విరిగిన ప్రాంతాల్లో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసీ ఏవీ కేబుళ్లతో విద్యుత్ సరఫరా అందించే ప్రత్యామ్నాయ మార్గాలు ముందే సిద్దం చేస్తున్నారు.

### డిజాస్టర్ టీంలు..

చెట్లు విరిగిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్దరణకు 20-25 డిజాస్టర్ టీమ్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈటీమ్‌లో కన్‌స్ట్రక్షన్, లైన్, ఆపరేషన్ అదికారులతోపాటు డైరెక్టర్ స్థాయి అధికారులవరకు పాల్గొంటారని ఓఉన్నతాధికారి తెలపారు. డిజాస్టర్ టీమ్‌లను ఎఫ్ఓసి, సిబీడీలకు అనుసంధానంగా ఏర్పాటు చేస్తున్నారు. డిజాస్టర్ టీంలో ఐదుగురు అధికారులు ఉండనున్నట్లు ఉన్నతాధికారులు తెలుపుతున్నారు.



# హైదరాబాద్ వార్త

# నీరు పోయేలా లేదు..మేమే వెళ్లిపోతాం

-జీహెచ్ఎంసీ కమిషనర్ ,ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినా స్పందన కరువు
-బ్రాహ్మణవాడి లైన్ నెంబర్ 1 నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళ్తున్న స్థానికులు



బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 1 లో ప్రహరీ గోడ వద్ద నిల్చిపోయిన నీరు..



ఇల్లు ఖాళీ చేసి సామాన్లతో ఇతర ప్రాంతానికి వెళుతున్న లైన్ నెంబర్ 1 వాసులు

**బేగంపేట మే 25,ప్రభాతవార్త :** రానుంది వర్షాకాలం.చిన్న పాటి వర్షాలకు పై నుంచి వస్తున్న నీరంతా తమ ప్రాంతంలో నీరు పోయే మార్గంలో ఈపీఎఫ్ క్వార్టర్స్ వారు గోడ అడ్డుగా కట్టడం,నీరు పోయే మార్గాన్ని కుదించి చిన్న రంధ్రం ఏర్పాటు చేయడంతో పై నుంచి వస్తున్న వర్షం నీరు తమ ఇళ్లలోకి చేరుతుండటంతో బేగంపేట బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 1లో నివసించే సుమారు 25 కుటుంబాల వారికి ప్రతి రోజు నరక యాతన మిగిల్సింది.దీంతో అక్కడ నివసిస్తున్న వారు శనివారం తమ సామాన్లతో సహా మరో ప్రాంతనికి తరలి వెళ్లారు.వర్షం నీటికి డ్రైనేజీ నీరు కూడా తోడవడంతో ఆ నీరంతా ఇళ్లలోకి చేరడం, గోడనుంచి వేగంగా పోయే మార్గం లేక రోజుల తరబడి ఇళ్ల ముందు నిల్చిపోవడంతో ఆ కుటుంబాల వారు విసిగి వేసారి పోయారు.తమ నివాసాల ముందు నీరు పోయే మార్గాన్ని కుదించడంతో పాటు నీటి ప్రవాహానికి అడ్డుగా ఈపీఎఫ్ క్వార్టర్స్ వారు ప్రహరీ గోడ నిర్మించడంతో తమ కష్టాలు మరింత అధికమయ్యాయని వారు వాపోయారు. తమ ఇళ్ల ముందు నీరు నిల్చి పోకుండా సాఫీగా సాగేలా చూడాలంటూ జీ హెచ్ఎంసీ కమీ షనర్, వాటర్ వర్క్స్ శాఖాధికారులకు , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదని మహ్మద్ యహ్యా ఖాన్ ఆరోపించారు.దీంతో మురుగు నీటిలో ఉండి తాము రోగాల పాలవుతున్నామని,భోజనం కూడా చేయలేని పరిస్థితులను ఎదుర్కొన్నామని,అందుకే ఇక అక్కడి ఇళ్లను ఖాళీ చేసి మరో చోటకి తరలి వెళుతున్నామని ఆయన వాపోయారు.తమతో పాటు అజీముద్దీన్ కుటుంబం కూడా అక్కడి ఇంటిని ఖాళీ చేసి వెళ్లి పోయారు.నగరం నడిబొడ్డున ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న బేగంపేట లో ఇలాంటి పరిస్థితి వస్తుందని తాము ఊహించలేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు.ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో తమ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకొనే ఈ నిర్ణయం తీసుకున్నామని యాహ్యాఖాన్ వాపోయారు.చిన్న పాటి వర్షం వస్తేనే తమ ఇళ్లలోకి రెండు అడుగుల మేర నీరు వచ్చి చేరుతుందని,ఆ నీటిలో ఇంట్లోని సామాన్లన్నీ నానిపోవాల్సిందేనని,దోమలు అధికంగా ఉన్నాయని, తీవ్ర దుర్వాసన తో ఈ ప్రాంతంలోని కుటుంబాలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నాయని వారు ఆవేదన చెందారు.

## నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో దాహం..దాహం..




**నిజాంపేట్, మే 25, ప్రభాతవార్త**

గృహావసరాలకే కాదు.. వ్యాపార, ఇండస్ట్రియల్ అవసరాలకు కావలసినంత నీరు ఉంది.. అయితే 'ట్యాంకర్ మీది.. వాటర్ మాది' అంటూ జలమండలి చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. వ్యాపార, పారిశ్రామిక అవసరాలకు దేవుడెరుగు.. కనీసం గృహావసరాలకు కూడా సరిపడా నీటిని అందించలేక జలమండలి అధికారులు చతికిలపడిపోతున్నారు. పై నుంచే వాటర్ సప్లై ఉండడం లేదా.. లేక సప్లై ఉన్నా నీటిని వదలడంలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారో ఏమో గానీ నిజాంపేట్ జర్నలిస్టు కాలనీ వాసులు నీటి కోసం అల్లాడుతున్నారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా ఎప్పుడు నీటిని వదులుతారో మిలియన్నల డాలర్ల ప్రశ్నే.. వాల్వ్ సమస్య పేరిట ఒకసారి, పై నుంచి వాటరన రాలేదని మరోసారి, పైప్‌లైన్ లేకేజీలని ఇంకోసారి.. ఇలా ఏదో ఒక సాకు చెప్పి నిర్ణీత సమయంలో వదలాల్సిన నీటిని సకాలంలో వదలడం లేదు. గత పది రోజుల క్రితం మోటార్ రిపేర్ వచ్చిందంటూ ఐదారు రోజుల పాటు నీటిని సరఫరా చేయలేదు. మోటార్ మరమ్మతులు పూర్తయ్యాక అయినా సక్రమంగా వదులుతున్నారా ? అంటే అదీ లేదు. ఎప్పుడు ఏ సమయంలో వదులుతారో అర్థం కావట్లుదు. వదిలినా లో ప్రెషర్‌తో వదలడంతో కనీస అవసరాలకు కూడా నీరు సరిపోవడంలేదు. శుక్రవారం రోజు నీటు సరపడా కావల్సి ఉండగా 20 నిమిషాల పాటు కూడా సరఫరా చేయకుండా బంద్ చేయడంతో ఏ విధంగా నీటి అవసరాలు తీరతాయని జర్నలిస్టు కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. . ట్యాంకర్లు బుక్ చేస్తే ఎప్పుడు వస్తాయో తెలియదు. పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే నీరు సరిపోవడంలేదు. దీంతో నీటి కోసం అవస్థలు పడుతున్నారు. నీటి సరఫరా విషయమై ఓ జలమండలి అధికారిని ప్రశ్నిస్తే వస్తాయ్.. ఓపిక పట్టండంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం గమనార్హం. నీటి సరఫరా చేయకుంటే జర్నలిస్టు కాలనీ వాసులు ధర్నాకు దిగుతామంటూ ఓ అధికారికి చెప్పుకుంటే.. ఆ చేయండి.. నేను కూడా ఓ 80మందిని తీసుకువచ్చి ధర్నా చేయిస్తా.. అంటూ వ్యంగ్యంగా సమాధానం చెప్పడం గమనార్హం. ప్రజా సేవకు అంకితం కావాల్సిన అధికారులే ప్రజల విషయంలో ఇంత చులకనగా వ్యవహరించడం పట్ల స్థానికంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు మాత్రం నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని క్రిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తుంటే ఇక్కడ మాత్రం నీటి సరఫరా విషయంలో ప్రదర్శిస్తున్న తీవ్ర నిర్లక్ష్య ధోరణి జర్నలిస్టుల కాలనీ వాసుల పట్ల శాపంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్ణీత కాలంలో సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

## గజవాహనంపై మలయప్పస్వామి

-దర్శనభాగ్యంతో పులకించిన భక్తులు



గజవాహన సేవ నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 25 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం మలయప్పస్వామి గజవాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో స్వామివారిని వాహనసేవలో దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. అహంకారం తొలగితే భక్తుడికి భగవంతుడు రక్షకుడిగా ఉంటాడనే విషయాన్ని గజవాహన సేవ గుర్తు చేస్తుంది. ఏనుగు ఓంకారానికి, విశ్వానికి సంకేతం. స్వామి ప్రణవ రూపుడు, విశ్వాకారుడూ, విశ్వాధారుడూ కనుక గజరాజుపై ఊరేగడంఎంతో సముచితం.ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థం, బాలభోగము, హవనము, బలిహరణము, మంత్రపుష్పం, ద్రావిడ ప్రబంధ పారాయాణాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ, మహానివేదన, మంత్రపుష్పం, భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. సాయంత్రం వేదపారాయణాలు, ద్రావిడప్రబంధము, హవనం పూర్తి చేశారు. తిరిగి బలిహరణము, మహానివేదన, హారతి, మంత్రపుష్పం అనంతరం 'గజవాహనసేవ' చిక్కడపల్లి శ్రీనివాసపురం తిరువీధుల గుండా వేదపండితుల మంత్రోచ్ఛారణలతో, మంగళవాయిద్యాల నడుమ సాగింది. కాగా ఆదివారం పల్లకీసేవ, రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని అధికారులు కోరారు.

# కౌటింగ్ విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

-హాల్‌లోకి మొబైల్ ఫోన్లు నిషేదం
-సిబ్బంది ఏ చిన్న పొరపాటుకు తావివ్వద్దు
-జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ రోనాల్డ్ రోస్,



హాజరైన సిబ్బంది

**హైదరాబాద్,మే 25,ప్రభాతవార్త:** లోక్‌సభ ఎన్నికలకు సంబందించిన కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పారదర్శకంగా జరిగేలా నిర్వహించాలని ఏచిన్నపొరపాటుకు సిబ్బంది తావివ్వొద్దని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. ఈమేరకు శనివారం బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవనంలో మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, ఏఆర్‌వోలకు కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపుకు సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఓట్ల లెక్కింపును మొత్తం 16 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని సగ్మెంట్ వారీగా ఓట్ల లెక్కింపు సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతుందని, నిర్ణీత సమయం సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవిఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు అందుబాటులో ఉండి సరి చేస్తారని పేర్కొన్నారు.

### ప్రతి హాల్లో 14టేబుళ్ల ఏర్పాటు ...

ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా అన్ని సెగ్మెంట్లలో ఓట్ల లెక్కింపు ప్రతిహాల్‌లో 14టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నామని, రౌండ్ల వారీగా కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ప్రతిటేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారని ఆయన వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా కౌంటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమైందన్నారు. మైక్రో అబ్జర్వర్లు రౌండ్‌లవారీగా ప్రతి రిపోర్టును ఎన్నికల అబ్జర్వర్లకు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏసమస్య ఉన్నా ఏఆర్‌వోకు తెలపాలని సూచించారు.

### కౌంటింగ్‌హాల్లో మొబైల్ నిషేదం ...

ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం కౌంటింగ్ హాల్‌లోకి మొబైల్ ఫోన్లు అనుమతించబడని కమిషనర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనలు పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా నిబద్దతతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. కౌంటింగ్ హాల్‌లో ఉండే ఏర్పాట్లు ,కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన ఆయా విషయాలపై రోనాల్డ్‌రోస్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎలక్ట్రానిక్ మెషిన్ కౌంటింగ్ కి సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఈసందర్భంగా వివిప్యాట్ స్లిప్పుల కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు సంబంధించన ఆయా ప్రక్రియను ఆయన వివరించారు.ఈకార్యక్రమంలో సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్, కంటోన్మెంట్ జాయింట్ సిఈవో అడిషనల్ కలెక్టర్ (యుబిడి) జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సునంద రాణి ,ఏఆర్‌వోలు, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మేయర్ లతా ప్రేమ్‌గౌడ్

- నూతన మేయర్‌ను ఆశీర్వదించిన సిఎం



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలిస్తున్న బండ్లగూడ జాగీర్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ దృశ్యం.

**నార్సింగి, మే 25 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ నూతన మేయర్ మద్దెల లతా ప్రేమ్ గౌడ్ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆశీర్వాదం పొందారు. రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కొఆపరేటివ్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నాయకత్వంలో మేయర్ లతాగౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు సీఎం నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకు ముందు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ఎంపి రంజిత్‌రెడ్డిలను కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మేయర్ లతాగౌడ్‌ను ఆశీర్వదించి, అభినందించారు. ఈ సందర్భంగా లతా ప్రేమ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ సీఎం, స్పీకర్, ఎంపిల ఆశీర్వాదంతో బండ్లగూడ కార్పోరేషన్‌ను అనతి కాలంలోనే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్పోరేషన్ నిధులతో పాటు జనరల్ నిధులను సైతం పెద్ద ఎత్తున తీసుకు వచ్చి ప్రధాన సమస్యలను శాశ్వత ప్రాతిపాదికన పరిష్కరిస్తామన్నారు. ప్రతీ కార్పోరేటర్ సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని, నిధులను అన్ని డివిజన్లకు సమానంగా విడుదల చేస్తామని తెలిపారు. కార్పోరేటర్లందరి నిర్ణయమే, మా నిర్ణయమని తెలిపారు. గత మేయర్ హయాంలో జరిగిన అవినీతిని వెలికి తీసి కార్పోరేషన్ ప్రజల ముందు పెడ్తామని, అంతా పారదర్శక పాలనను అందిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, స్మశాన వాటికలు, పార్కులు వంటి వాటికి పెద్దపీఠ వేస్తామని తెలిపారు. గత మేయర్ ముందు చూపు లేకుండా, కార్పోరేటర్ల సూచనలు పట్టించుకోకుండా పోవడంతో ఇప్పుడు కార్పోరేషన్ ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జల మండలి ఉన్నతాధికారులతో సమావేశమై మంచినీటి క్వాంటిటీని పెంచేలా చూస్తామన్నారు. అవసరమైతే బండ్లగూడ కార్పోరేషన్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతామని, ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తామని వివరించారు.

# బండిస్తే గండమే !

-మైనర్‌కు వాహనమిస్తే ముప్పు తప్పదు !!

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త :** మైనర్లు వాహనం నడుపుతూ బయటకు వచ్చారంటూ ఆ తప్పు పూర్తిగా వారిదేకాదు, వారికి వాహనాన్ని ఇచ్చిన తల్లిదండ్రులు, యజమానిదీ తప్పే అంటూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు పలు మార్లు స్పష్టం చేసింది. దీంతో పాటు గతంలో అనేక ఉదంతాల్లో మైనర్ డ్రైవింగ్ పలువురి ప్రాణాలు తీసింది. ఈ పరిణామాలను సీరియస్‌గా తీసుకున్న నగర పోలీసులు మైనర్ డ్రైవింగ్ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీనికి సంబంధించిన కేసుల్లో వాహన యజమానిపైనా కేసు నమోదు చేసి, కోర్టుల్లో అభియోగపత్రాలు దాఖలు చేయనున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 51లో గత నెల 14న రాత్రి కియా కారుతో ప్రమాదం చేసిన ఎర్రగడ్డకు చెందిన మైనర్‌తో (17) పాటు అతడి తండ్రిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విధానాన్ని రానున్న రోజుల్లోనూ కొనసాగించనున్నారు. శాంతిభద్రతల విభాగంతో పాటు ట్రాఫిక్ అధికారులు దీన్ని అమలు చేస్తారు.

### మూడో కేటగిరీలో మైనర్ డ్రైవింగ్..

ట్రాఫిక్ పోలీసులు ఉల్లంఘనల్ని ప్రధానంగా మూడు కేటగిరీలుగా విభజిస్తారు. వాహనం నడిపే వ్యక్తికి ముప్పు కలిగించేవి, ఎదుటి వారికి ముప్పుగా మారేవి, వాహన చోదకుడితో పాటు ఎదుటి వ్యక్తికీ ముప్పును తెచ్చిపెట్టేవి. మైనర్ డ్రైవింగ్ మూడో కేటగిరీ పరిధిలోకి వస్తుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఏటా నగరంలో నమోదవుతున్న ప్రమాదాలను విశ్లేషిస్తే.. ద్విచక్ర వాహనాల కారణంగానే ఎక్కువగా జరుగుతున్నాయని తేలింది. యువత ఎక్కువగా వినియోగించేది ఈ వాహనాలే. ఆ తర్వాత స్థానం తేలికపాటి వాహనాలైన కార్లు వంటి వాటిది. ఈ కారణంగానే ప్రమాదాల బారినపడుతున్న కారణంగా మారుతున్న వాటిలో ఇవే ఎక్కువగా ఉంటున్నాయి. ద్విచక్ర వాహనాల వల్ల జరుగుతున్న ప్రమాదాల్లో వాహన చోదకులతో పాఉ పాదచారులూ ఎక్కువగా మృత్యువాతపడుతున్నారు. ముఖ్యంగా అనేక విద్యాసంస్థలు నగర శివార్లలో ఉండటంతో సొంత వాహనాలపై వాటికి వెళ్ళి వచ్చే క్రమంలో ఎందరో యువకులు మృత్యువాత పడుతున్నారు. దీనికి తోడు అడపాదడపా చోటు చేసుకుంటున్న రేసింగ్స్ కూడా అనేక మంది ప్రాణాలను హరిస్తున్నాయి. ఇలాంటి మృతుల్లో వాహనాలు డ్రైవ్ చేస్తున్న మైనర్లు పెద్ద సంఖ్యలోనే ఉంటున్నారు.

### నిబంధనలేం చెబుతున్నాయంటే..

భారత మోటారు వాహనాల చట్టం ప్రకారం (ఎంవీ యాక్ట్) పదహారేళ్లలోపు వయస్సు వారు ఎలాంటి వాహనాలనూ నడపకూడదు. వీరు వాహనాలను నడుపుతూ రోడ్లపైకి రావడం నిషేధం. 16 ఏళ్లు నిండిన వారు మాత్రం కేవలం గేర్లు లేని సాధారణ వాహనాలు నడిపే అవకాశం ఉంటుంది. 18 ఏళ్లు నిండిన తరువాత మాత్రమే గేర్లతో కూడిన వాహనాలు నడపడానికి అర్హులు. ఆర్టీఏ అధికారులు లైసెన్స్ సైతం వీరికే మంజూరు చేస్తారు. చట్ట ప్రకారం మైనర్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనాన్ని ఇచ్చిన యజమాని సైతం శిక్షార్హుడే. అంటే ఎవరికైనా మన వాహనాన్ని ఇవ్వాలంటే తొలుతవారు మేజరేనా ? డ్రైవింగ్ లైసెన్స్ ఉందా ? అనేవి తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ ఉన్న చట్టాలపై తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం. అమలుపై యంత్రాంగాలు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడం కారణంగా ఎన్నో 'ఇంటి దీపాలు' చిన్న వయసులోనే ఆరిపోతున్నాయి.

### ఎంవీ యాక్ట్‌లోని ఆ సెక్షన్ వాడుతున్నారు.

వారం రోజుల వ్యవధిలో వరుసగా చోటు చేసుకున్న బహదూర్‌పురా, మెహిదీపట్నం ఉదంతాలతో ట్రాఫిక్ పోలీసులు తమ పంథా మార్చుకున్నారు. ఇప్పటివరకు మైనర్ డ్రైవింగ్ కేసుల్లో అత్యంత అరుదుగా మాత్రమే.. అదీ వాహనం నడిపే వ్యక్తిపై చార్జిషీట్ దాఖలు చేసేవారు. మోటారు వాహనాల చట్టంలోని 180 సెక్షన్ ప్రకారంఒ మైనర్ కానీ, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తి కానీ వాహనం నడిపితే.. అతడితో పాటు వారికి వాహనం అందించిన దాని యజమానినీ బాధ్యుడిని చేసే అవకాశం ఉంది. మైనర్ నడిపే వాహనం ప్రమాదానికి కారణం కావడమో, గురికావడమో జరిగితేనే కాదు.. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో చిక్కినా ఈ తిప్పలు తప్పవు. మైనర్లు ఎక్కువగా కుటుంబీకులు, సంబంధీకుల వాహనాలే తీసుకుని బయటకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో వారే ఆయా కేసుల్లో నిందితులుగా మారే అవకాశం ఉంది. మోటారు వాహనాల చట్టంలోని 181 సెక్షన్ కింద వీరిపై కేసు నమోదు చేసి, కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేస్తారు. కోర్టులో ఈ నేరం రుజు వైతే జైలు శిక్ష, జరిమానా లేద రెండూ విధించే అవకాశం ఉంది.

## నగరంలో డీలక్స్ బస్సులు

**హైదరాబాద్ మే 25 ప్రభాతవార్త**

జంట నగరాల్లో అతి తొందరలో సిటీ బస్సు ప్రయాణం రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఇందుకుగాను 25 ఎలక్ట్రిక్ ఏసీ, 25 నాన్‌ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు నగరానికి చేరుకున్నాయి.అలాగే మరో 450 ఎలక్ట్రిక్ బస్సులు జులై నెల చివరి నాటికి రోడ్డెక్కనున్నాయి. టీజీఎస్‌ఆర్టీసి తన మెరుగైన ప్రయాణాన్ని అందించేందుకు చర్యలు చేపడుతోంది. హైదరాబాద్ సిటీలో ప్రయాణించేందుకు వీలుగా 125 డీలక్స్ బస్సులను ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకరానున్నారు. ఈ బస్సులు జులై నుంచి అందుబాటులోకి రాబోతున్నాయి. సిటీలోని అన్ని ప్రధాన రహదారుల్లో డీలక్స్ బస్సుల సేవలు నడపనున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో సిటీ, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 'మహాలక్ష్మి పథకం' కింద మహిళలకు ఉచిత ప్రయాణాలు కొనసాగుతున్నాయి. దీనితో ఈ ఉచిత బస్సులలో టికెట్ హోల్డర్స్ ప్రయాణం చేసేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ ప్రయాణికులున్న బస్సులు ఎక్కలేక అనేక మంది ప్రయాణికులు వేరే రవాణ సదుపాయాల వైపు పరుగులు పెడుతున్నారు.ఈ నేపథ్యంలో అలాంటి ప్రయాణీకులు సౌకర్యవంతంగా వెళ్లేందుకు వీలుగా ఈ కొత్త డీలక్స్ బస్సులను అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇక ఈ బస్సులలో ఉచిత మహాలక్ష్ములను, పాస్ హోల్టర్స్‌ను ఈ బస్సులలోకి అనుమతించరు. కేవలం 'పేయిడ్ సర్వీస్' పేరుతో ఈ బస్సులను సిటీలో నడపనున్నారు. డీలక్స్ బస్సులు కాబట్టి టికెట్ ధరలు కూడా కాస్త ప్రీమియంగా కూడా ఉండొచ్చు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## జూన్ 1న జరిగే హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయండి

### -మాధవరం కాంతారావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంతారావు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 25, ప్రభాతవార్త**

జూన్ 1న జరిగే హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు పిలుపునిచ్చారు. జూన్ 1న శ్రీ హనుమాన్ జన్మోత్సవాన్ని పరుస్కరించుకుని కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న శ్రీ వీర హనుమాన్ ఏక్తా యాత్రకు సంబంధించిన ముందస్తు కార్యాచరణ సమావేశం శనివారం కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని బాలాజీ నగర్ కాలనీ శ్రీ సంజీవినీ హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంతారావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూ ఏక్తా ర్యాలీలో ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ అభియాన్ కమిటీ సభ్యులు, సంజీవని హనుమాన్ దేవాలయ సభ్యులు, హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఆంజనేయ నగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం



**కెపిహెచ్‌బి కాలనీ, మే 25, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ డివిజన్ ఆంజనేయ నగర్ కాలనీలోని శ్రీ సీతారామ కళ్యాణ మండపం వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మూసాపేట డివిజన్ అధ్యక్షుడు చున్ను పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 300మంది పాల్గొని ఉచితంగా షుగర్, థైరాయిడ్, సాధారణ చికిత్సలు చేయించుకున్నారు. పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చున్ను పాషా మాట్లాడుతూ మూసాపేట పరిసర ప్రాంతాలలో ప్రతి వారికి ఒక్కసారి వైద్య శిబిరం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ ముస్సి, డాక్టర్ రజిత, ప్రవీణ్, శ్రీకాంత్, రాకేష్, సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్క పెంటయ్య, మోయేజ్, తూము సచిన్‌కుమార్, టింకు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ పరంగా అబివృద్ధి చెందాలి : రాఘవేందర్ రావ్



కంటోన్మెంట్ డైమాండ్ పాయింట్ వద్ద పెన్ మహోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న రాఘవేందర్ రావ్

**కంటోన్మెంట్,మే 25 ప్రభాతవార్త:**

కమ్యూనిటీ పరంగా అభివృద్ధి చెందితేనే సమాజంతో పాటు దేశం మరింత అభివృద్ధి చెందుతుందని,వివిధ రకాల వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తున్న పారిశ్రామిక వేత్తలు, వ్యాపార, వాణిజ్య సంస్థల క్రీడాకారులు అన్ని రంగాల్లో ప్రతిభకనబర్చి మరి కొందరికి ఉపాధి కల్పించే విధంగా ఎదగాలని బొందాద సంస్థ సిఎండి రాఘవేందర్ రావ్ తెలిపారు. శనివారం డైమాండ్ సమీపంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పెన్ మహోత్సవం 2024 హోం , లైఫ్ స్టైల్, ఫ్యాషన్ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 130 వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పెన్ మహోత్సవంలో 25వేల మంది సభ్యులు ఉన్నారన్నారు. ప్రతి యేటా కోట్లాధి రూపాయలు టర్నోవర్ చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు వివిధ దేశాల్లో స్థిరపడ్డ తెలుగు వ్యాపారులకు పెన్ (పటెల్ ఎంటర్‌పెన్ నెట్‌వర్క్) ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మెజిషియన్ సామల వేణు, అర్గనైజర్ మురళీధర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## సులభంగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలు..

**- ఇద్దరిని అరెస్ట్ చేసిన సుల్తాన్‌బజార్ పోలీసులు..పరారీలో నాగరాజు**

**బేగంబజార్,మే25ప్రభాతవార్త:** దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్ట్‌చేసివారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కుతరలించారు.ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి కథనం ప్రకారం.. ఇతర రాష్ట్రాల నుంచి నగరంలోని నాంపల్లి,సిబిఎస్ తదితర ప్రాంతాలల్లో పుట్‌పాత్‌లపై చిన్న,చిన్న వ్యాపారులు చేసుకుంటున్నారు.డబ్బులు సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించేందుకుగాను దొంగతనాలు చేసేందుకు పథకం వేశారు. నాగరాజు,మహమ్మద్ షాన్వాజ్, సిద్దుదంగర్‌లు ఈనెల19వతేదిన రంగ్‌మహల్ చౌరస్తానుంచి నడుచుకుంటూ వెళ్తున్న మహ్మద్ ఫిరోజ్‌ను వెంబడించారు.కొద్ది దూరం వెళ్లగానే ముగ్గురు ఎదురుదాడి చేసి అతని వద్ద8500 నగదుతో పాటు ఒకసెల్‌ఫోన్ లాక్కున్నారు.దొంగలించిన డబ్బులను 4000వేల రూపాయలను,సెల్‌ఫోన్‌ను నాగరాజు తీసుకోన్నగా,షాన్వాస్,సిద్దులు 2500 రూపాయల చొప్పున పంచుకున్నారు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని షాన్వాస్,సిద్దులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.నాగరాజు ప్రస్తుతం పరారీలో ఉన్నారు.ఈ కేసును సుల్తాన్‌బజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఒకరి పేరిట పరీక్ష రాస్తూ పట్టుబడ్డ యువకుడు

**బేగంపేట మే 25,ప్రభాతవార్త :**

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో వేరొకరి బదులు పరీక్ష రాస్తూ ఓ యువకుడు పట్టుబడ్డాడు.ఈ ఘటన ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.యూసఫ్‌గూడా రహ్మత్ నగర్ కు చెందిన నీలం లోకేష్ (19) జెప్టోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు.ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాల్సి ఉన్న లోకేష్ కు ఎస్సార్ నగర్ లోని శ్రీసూర్య జూనియర్ కళాశాలలో సెంటర్ కేటాయించారు.అయితే శుక్రవారం జరిగిన సంస్కృతం పేపర్ 2 పరీక్షకు నీలం లోకేష్ కు బదులు జవహర్ నగర్ యూసఫ్ గూడా కు చెందిన వరప్రసాద్ (20) పరీక్షకు హాజరయ్యాడు.పరీక్షా కేంద్రం మొదటి అంతస్థులోని రూమ్ నెంబర్ 101లో వరప్రసాద్ పరీక్ష రాస్తుండగా ఇన్విజిలేటర్‌గా ఉన్న రోజ అనుమానం తో హాల్ టికెట్‌ను పరిశీలించింది.దీంతో వేరొకరికి బదులు అతను పరీక్ష రాస్తున్నట్లు గుర్తించారు.వెంటనే పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.సుందర్ షార్ కు ఫిర్యాదు చేసారు.ఆయన ఫిర్యాదు మేరకు ఎస్సార్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసారు.ఎస్సై రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పొంగుతున్న మ్యాన్ హోల్..గల్లీలన్నీ గలీజు..

**బేగంపేట మే 25,ప్రభాతవార్త**

ప్రకాశం నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం పక్కనే ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రి నిర్వాకం ప్రకాశం నగర్ వాసులకు ప్రాణాంతకంగా మారింది.రెండు మూడు రోజుల కొకసారి ఈ ఆస్పత్రి వద్ద ఉన్న మ్యాన్ హోల్ పొంగి పొర్లుతూ ప్రకాశం నగర్ వీధులను మురుగునీటితో ముంచెత్తుతుండటంతో గల్లీలన్నీ గలీజ్ గా మారిపోయాయి. అడుగు తీసి అడుగువేయాలంటే మురుగు నీటిలోనే దిగి నడవాల్సిన దుస్థితి అంటూ స్థానికులు వాపోతున్నారు.అధికారుల నిర్లక్ష్యం,ప్రజా ప్రతినిధుల బాధ్యతారాహిత్యం,ఆస్పత్రి యాజమాన్యం ముందు చూపు లేకపోవడం ఈ ప్రాంత వాసులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది.ఏదైనా భారీ బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణం చేసేవారు తమకు ప్రత్యేకంగా నీటి సౌకర్యం కోసం,డ్రైనేజీ లెల కోసం ప్రత్యేకంగా లైన్లు వేయించుకోవాల్సి ఉంటుంది.ఈ ఆస్పత్రి ఇక్కడ ప్రారంభమైన నాటి నుంచి వారంలో రెండు సార్లు ఈ మ్యాన్ హోల్ నుంచి డ్రైనేజీ నీరు బయటకు పొంగి పొర్లుతూ రోడ్లపైకి చేరుతుందని,దీంతో ఈ మార్గంలో నడిచి వచ్చే వారు,స్థానికంగా వ్యాపారాలు చేసుకునే చిరు హోటళ్ల వారు ఇలా ప్రతి ఒక్కరూ డ్రైనేజీ నీటి నుంచి వస్తున్న తీవ్ర దుర్వాసనతో అనారోగ్యాల బారిన పడుతున్నామంటూ వాపోతున్నారు.ఆస్పత్రి నిర్మాణం ఇక్కడ కాకముందు ఇలా జరగలేదని,ఈ మధ్య కాలంలోనే ఇలా మురుగు నీరు రోడ్లపై పారుతూ తీవ్ర అసహనానికి గురి చేస్తుందని మహిళలు ఆరోపిస్తున్నారు.ఇలా అయితే తాము ఇక్కడ ఎలా ఉండగలమంటూ వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు.ఈ మ్యాన్ హోల్ పొంగి ప్రవహించేది బేగంపేట



ప్రకాశంనగర్ వాటర్‌వర్క్స్ కార్యాలయం పక్కనే పొంగుతున్న మ్యాన్ హోల్

ప్రకాశం నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం పక్కనే కావడం, వారు ఏ మాత్రం దీనిపై దృష్టి సారించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి మ్యాన్ హోల్ పొంగి పొర్లకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రకాశం నగర్ వాసులు కోరుతున్నారు.

# రచయితలు ఎక్కువ చదివి తక్కువ రాయాలి

**-ప్రఖ్యాత కథా నవలా రచయిత పి.లోకేశ్వర్**

**-వైభవంగా ప్రఖ్యాత కవి పండితులు ప్రముఖుల పరిణతవాణి**

**నాంపల్లి, మే 25 ప్రభాతవార్త :**

రచయితలు ఎక్కువగా చదివి తక్కువగా వ్రాయాలని, ఒక జీవితంలో అనేక జీవితాలను ఆవిష్కరించే అనుభవం పొందాలని ప్రఖ్యాత కథా, నవలా రచయిత, కాలమిస్టు పరవస్తు లోకేశ్వర్ సూచించారు. పాఠ్యపుస్తకాలపట్ల అనాసక్తివున్నా ఇతర పుస్తకాలను అసంఖ్యాకంగా చదివానని, ఆయా పుస్తకాలు, గ్రంథాలయోద్యమ స్ఫూర్తి తన వ్యక్తిత్వాన్ని మలిచాయని తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బొగ్గులకుంట పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్విరామంగా కొనసాగుతున్న 65ఏళ్ల ప్రాయందాటిన ప్రఖ్యాత కవిపండితులు, ప్రముఖుల స్వీయసాహిత్య జీవిత విశేషాలను ఆవిష్కరింపజేస్తున్న ఉపన్యాస పరంపర సాగుతోంది. ప్రముఖ కథా, నవలా రచయిత, హైదరాబాద్ నగర చరిత్ర, సంస్కృతిపై విస్తృతంగా పత్రికల్లో శీర్షికలు నిర్వహిస్తూ అరుదైన విశేషాలు అందిస్తున్న కాలమిస్టు, యాత్రా చరిత్రకారుడు పరవస్తు లోకేశ్వర్ శనివారం రాత్రి పరిణతవాణిలో స్వీయ సాహిత్య జీవిత విశేషాలను వివరించారు. సలాం హైదరాబాద్, షహర్ నామా తదితర నగర చారిత్రక గ్రంథాలు; పలు యాత్రా రచనలు వెలువరించినట్లు, ఇవన్నీ బహుళ పాఠకాదరణ పొందినట్లు వివరించారు.



పరిణతవాణిలో ప్రసంగిస్తున్న లోకేశ్వర్, శివారెడ్డి, చెన్నయ్య, సిల్మానాయక్‌లు

ఈ సందర్భంగా సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య, పరిషత్తు ప్రాచ్యకళాశాల ప్రధానాచార్యుడు డా. ఎ.సిల్మానాయక్ సమావేశకర్తగా వ్యవహరించి చివరిగా ప్రసంగకర్త పరవస్తు లోకేశ్వర్‌ను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

# పాదచారులే లక్ష్యంగా సెల్‌ఫోన్లు లాక్కుని వెళ్తున్న ముఠా అరెస్ట్....

**బేగంపేట మే 25,ప్రభాతవార్త**

తెల్లవారు ఝాము సమయంలో బైకులపై నగరంలో తిరుగుతూ నడుచుకుంటూ వెళ్లే పాదచారులే లక్ష్యంగా వారి వద్ద ఉన్న విలువైన సెల్‌ఫోన్లను లాక్కుని వెళ్తున్న ముఠాను ఎస్సార్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు.వీరు సెల్‌ఫోన్లతో పాటు ద్విచక్ర వాహనాలను కూడా చోరీ చేస్తున్నట్లు గుర్తించారు..పోలీసులు అరెస్ట్ చేసిన ముఠాలో ఓ బాలుడితో పాటు ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ 4లక్షల విలువ చేసే 12 సెల్‌ఫోన్లు,3ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఎస్సార్ నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి,డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జానకి రాములు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బాలానగర్ లోని ఫిరోజ్‌గైడాకు చెందిన కె.సాయిహనుమాన్(19),బాలానగర్ రాజు కాలనీకి చెందిన మహ్మద్ అఫ్రోజ్(19),మహ్మద్ నసీరుద్దీన్ పటేల్ (18).బాలానగర్ గౌతం నగర్ కు చెందిన బిట్టు కుమార్ షా( 20)లు ఒక ముఠాగా ఏర్పడి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలపై తిరుగుతుంటారు.ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న వారిని వీరు టార్గెట్ చేస్తారు.వారు సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ వెళ్తున్న వారిని గమనిస్తూ వెళ్లి వారి చేతుల్లోనుంచి సెల్‌ఫోన్లను లాక్కుని పారిపోతారు.చోరీలు చేయడంతో పాటు వీరు ద్విచక్రవాహనాలను కూడా దొంగిలిస్తుంటారు.చోరీ చేసిన సెల్‌ఫోన్లను ఓ బాలుడు గౌతం నగర్ కు చెందిన మహ్మద్ ఇమ్రాన్(22) లకు ఇచ్చి వారితో తక్కువ ధరకు అమ్మి సోమ్ము చేసుకుంటుంటారు.ఎస్సార్‌నగర్,బాలానగర్,కూకట్‌పల్లి, సనత్‌నగర్,మాదాపూర్,హైటెక్ సిటీ ప్రాంతాల్లో వీరు సెల్‌ఫోన్ల చోరి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈమధ్య కాలంలో ఎస్సార్‌నగర్,సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు చోట్ల సెల్‌ఫోన్ల చోరీ చేసారు.

ఈ మేరకు బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీ సులు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి నిందితులను అరెస్ట్ చేసారు.వారి నుంచి 9కేసులకు సంబంధించిన 12సెల్‌పోన్లు,3ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

# నగర శివార్లను కబళిస్తున్న నకిలీ వైద్యుల ముఠా

**-ఐడిపిఎల్ అధికారుల తనిఖీలలో నివ్వెరపరిచే అంశాలు**

**-డయాగ్నస్టిక్స్, మెడికల్ షాపుల లాభాలలో మాఫియాను తలపిస్తున్న నకిలీ వైద్యులు**

**-కార్పొరేట్ ఆసుపత్రులకు కాసులవర్షం కురిపిస్తున్న నకిలీవైద్యుల సూచనలు**

**కుత్బుల్లాపూర్, మే 25 ప్రభాతవార్త**

నకిలీ వైద్యుల మాఫియా విస్తరణ సామాన్య ,మధ్యతరగతి ప్రజల ధన, ప్రాణాలతో ఆటలాడుతున్న వైనాలు నగర శివారు కుత్బుల్లాపూర్ ప్రజల్ని తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఏకంగా క్లీనిక్‌లు, ఆసుపత్రులు ఏర్పాటుచేసి యధేచ్ఛగా వైద్యాన్ని వ్యాపారంగా మార్చి దళారులు ఆడుతున్న వింతనాటకంలో నిరుపేదలే బలిపశువులు అవుతున్న తతంగానికి కుత్బుల్లాపూర్ పరిసర కార్మిక వాడలు, బస్తీలు కేంద్రబిధువులు గా మారుతున్న తీరు ఆందోళనకు గురిచేస్తుంది. గత మూడు రోజులుగా వైద్య, ఆరోగ్య విభాగం నిర్వహిస్తున్న దాడులతో అధికారులకే విస్తుపోయే అనేక అంశాలు వెలుగుచూస్తున్నా స్థానిక అధకార యంత్రాంగం నకిలీవైద్యులను అరికటట్టడంతో ఎంతఘోరంగా విఫలమైందో ఇట్టే అవగతమవుతుంది. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలోని షాపూర్‌నగర్, ఐడిపిల్‌కాలనీ, చింతల్, గాజులమారం రోడ్లతోపాటు జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాలను తమ వ్యాపారకేంద్రాలుగా మలుచుకుంటున్న నకిలీవైద్యుల నిర్వాహణ తీరు నిరక్షరాస్యులనే కాదు విద్యావంతులను కూడా విస్మయానికి గురిచేస్తున్న తీరు ముక్కున వేలేసుకునేవిధంగా మారింది. నగరశిరు కుత్బుల్లాపూర్ పరిధిలోనికొన్ని వైద్యాలయాలలో నిర్వాహకుల విద్యార్హతలను పరిశీలిస్తే అసలు మనం నగరంలోనే ఉన్నామా? లేక మారుమూల ప్రాంతాలో ఏమైనా నివస్తున్నామా? అనే అనుమానం కలుగక మానని ఆందోళన పరిస్థితి నెలకొంటుంది.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విభాగం అధికారుల తనిఖీలో సుమారు 50మంది నకిలీ డాకర్ల గుర్తింపు . తెలంగాణ వైద్య విభాగానికి చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధికారులు శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఐడిపిఎల్ కాలనీ, చింతల్, షాపూర్‌నగర్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాలలోని ప్రైవేట్ ఆసుపత్రులపై అకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల లోవారికి విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి. అసలు వైద్యవృత్తికి ఎలాంటి సంబందంలేని దళారులు, మోసగాళ్లు ఏకంగా ప్రైవేట్ వైద్యాలయాలను నిర్మించి యధేచ్ఛగా తమ వ్యాపారాలను పవిత్ర వృత్తిగా నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని తేలింది. వివిధ అనారోగ్య పరిస్థితులపై వచ్చేరోగులను వివిధ పరీక్షలు, మందుల పేరుతో అందిన కాడికి దబ్బులు వసూలుచేయడంతో




ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధికారులు చింతల్ గణేష్‌నగర్ తదితర ప్రాంతాలో తనిఖీలు నిర్వహించి నకిలీ డాక్టర్లను అదుపులోకి తీసుకున్న దృశ్యం

పాటు శంకర్‌దాదా ఎంబిబిఎస్ వైద్యాన్ని అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నతీరు ఆందోళనకు గురిచేస్తుంది. కార్మికవాడలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా వుండే ప్రాంతాలను తమ వ్యాపార కేంద్రాలుగా మార్చుకుంటున్న నకిలీ వైద్యులు చేస్తున్న మోసంచూస్తే సినిమా సీన్లు వీరిముందు దిగదుడుపే అన్నచందంగా మారుతున్నాయి. గతంలో ఆయా ఆసుపత్రులతో డాక్టర్లక్రింద పనిచేసే పనివారు ఎదోఒక సర్టిఫికెట్లను పొంది స్వయంగా క్లీనిక్‌లనే ప్రారంభిస్తున్నారు. ఇక వారి వేష, బాష విధానంద్వారా నియమైన వైద్యులకు తామేమీ తీసిపోమని నమ్మిపిస్తు అమాయక రోగులనుండి వేలకు వేల రూపాయలను దండుకుంటున్నతీరు క్షమార్హమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతల్ గణేష్‌నగర్ సమీపంలో ఒక నకిలీ ఫైల్స్‌డాక్టర్ రోగులను మోసగిసప్పున్నతీరుపై అధికార యంత్రానికి ముక్కునవేలేసుకునేవిధంగా చేసిందంటే వారిపనితనానికి వేరే ఉదాహరణ లేదనేవిధంగా మారిపోయింది. ఫైల్స్ వ్యాధితో వచ్చే వివిధ ప్రాంతాల రోగులనుండి వేలకువేల రూపాయలను దండుకుని తోచినమందు ఇచ్చి పంపుతున్న ఈ వైద్యునితీరు చూస్తే ప్రజలు ఇంత గుడ్డిగా వైద్యులను నమ్ముతారా అనే అనుమానం కలుగక మానదు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి నకిలీవైద్యుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

## రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

**డిసిఎంఎస్ వైస్‌చైర్మన్, శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి**

**శామీర్‌పేట, మే 25, ప్రభాతవార్త** రైతులు పండించిన వరి ధాన్యం ప్రతి గింజను కొనుగోలు చేయటం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవ సరం లేదని డిసిఎంఎస్ వైస్‌చైర్మన్,శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధు కర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వరి ధాన్యంను ఆయన పరిశీలించారు. రోజుకు ఎన్ని బస్తాలు వరి ధాన్యం వస్తుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగ సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితితులు ఉన్నందున రైతులు వెంటనే వరి ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. కేంద్రాలకు తీసుకవచ్చిన ధాన్యాన్ని మ్యాచరింగ్ చూసి కొనుగోలు చేయాలని సూచించారు. నాణ్యతగా ఉన్న గన్నీ బ్యాగులను రైతులకు పంపిణీ చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ దాన్యంను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల రైతు నాయకులు, మాజీ ఉపసర్పంచులు కంటం కృష్ణారెడ్డి, జి. ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ డైరక్టర్ నరేందర్‌రెడ్డి, రైతు నాయకులు సంజీవరెడ్డి, వీరారెడ్డి, రాజు, రాంరెడ్డి, ఎల్లయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం పోరాటంతో పే స్లిప్పులు

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య**

**యాచారం మే25,ప్రభాతవార్త :** వ్యవసాయ కార్మిక సంఘం పోరాటంతో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల ఉపాధి కూలీలకు పేస్లిప్పులు అంద జేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య ,జిల్లా నాయకులు జంగయ్య, మండల నాయకులు బెల్లి ఇందిరమ్మ ,ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని సింగారం గ్రామంలో ఉపాధి కూలీల దగ్గరికి పోయి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు నెలలు గడిచినా పే స్లిప్పులు ఇవ్వడం లేదని అధికారులు పిడి, ఎంపిడివో ,ఎపిఒలకు ప్రతి రోజులు చెప్పిన ఫలితం లేకపోవడంతో శనివారం మాల్ గ్రామ పంచాయతీ ముందు ధర్నా చేస్తామని ప్రకటించగా అధికార యంత్రాంగం అంత కదలి మండలంలో అన్ని గ్రామ పంచాయ తీలకు స్లిప్పులు విడుదల చేయడం జరిగిం దని అన్నారు. కూలిలందరికి పే స్లిప్పులు క్రమం తప్పకుండా ప్రతి వారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్త పనులు మంజూరు కాకపోవడంతో వేలాది మంది కూలీలు పని లేక ఇంటికాడ ఉండి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు.



బంజారాహిల్స్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..

**నిజాంపేట్, మే 25, ప్రభాతవార్త :** విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమంలో భాగంగా 33/11 కేవీ డీపీ పల్లి సబ్‌స్టేషన్ 2 నుండి 11కేవీ మిలీనియం ఫీడర్ పరిధిలో నేడు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మిలీనియం పరిశ్రమ, ఎస్‌విబికె ఫంక్షన్ హాల్, గాంధీ మైసమ్మ ప్రాంతాలతో పాటు.. 11కేవీ ఐడీఏ 2 ఫీడర్‌లోని 33/11 కేవీ బాదుర్‌పల్లి సబ్ స్టేషన్ నుండి మధ్యాహ్నం 2 గంటల నుండి 3:30 గంటల వరకు జ్యోతి పాల పరిశ్రమ, హైటెక్ పరిశ్రమ, బాదుర్‌పల్లి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బి.సాయి కిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు.

### కళల పట్ల ఉన్న స్పృహ చక్కని అవకాశాలకు మార్గం చూపుతుంది

**బేగంపేట మే 25,ప్రభాతవార్త**

కళల పట్ల స్పృహ కలిగి ఉంటే అది చక్కటి అవకాశాలకు మార్గం చూపుతుందని, వక్తలు పేర్కొన్నారు.బేగంపేట హోటల్ మనోహర్ లో శనివారం జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్,ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ,బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ,టాస్క్,ఎంఎస్‌ఎంఈ తదితర సంస్థల సహకారంతో క్రియేటివ్ కెరీర్స్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2024ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన నిపుణులు 600మంది విద్యార్థులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి జీవితాలలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే ఆసక్తి కలిగిన రంగంలో నైపుణ్యం సంపాదించాలన్నారు.అందుకు కావాల్సిన ప్రతి అవకాశాన్ని చక్కగా వినియోగించుకోవాలన్నారు.ఇలాంటి సదస్సులు తరచూ నిర్వహిస్తున్నట్లైతే విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు.అన్ని విద్యా సంస్థలను ఒకే చోట చేర్చడం ద్వారా విద్యార్థులకు అవసరమైన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. సదస్సు ద్వారా ఫోటోగ్రఫీ, యానిమేషన్, ఫిల్మ్ మేకింగ్,వీఎఫ్ ఎక్స్,ఫ్యాషన్ ,మేకప్,గేమింగ్ తదితర రంగాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచారు.విద్యార్థులకు ఆయా రంగాలకు చెందిన ప్రతినిధులు అవసరమైన రంగాలపై అవగాహన కల్పించారు.ఈ సదస్సుకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరక్టర్ శృతి ఓజా,టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా,సారథి కృష్ణ,ప్రతిభ,పి.కే.పోలిన,రిషబ్‌గుప్తా,గీత,ఎఆర్ కమల్ రాయ్,గోపీ, అరుణ దాసరి,గోపీ,భాస్కర్ రాజు,రాధిక బడేలా,రాజశేఖర్ బుగ్గవీటి,బండి రమణ తదితరులు పాల్గొన్నారు.

### పూడూర్‌లో ప్రాసెసింగ్ క్లస్టర్‌ను సందర్శించిన కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్, మే 25, ప్రభాతవార్త ః** మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామంలో ఆదర్శ రైతు సేవా సహకార సంఘంలో పరిశ్రమల పునరుత్పత్తి పథకంలో భాగంగా సూక్ష్మ, చిన్న తర హా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కూరగా యలు, పండ్ల ప్రాసెసింగ్ క్లస్టర్‌ను శనివారం మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. ఈ సందర్భంగా యంత్రాల కొనుగో లు, వాటి ఏర్పాట్ల విషయాలను పరిశీలించి అధికారు లకు తగి న సలహాలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి, కూరగా యలు, పండ్ల ధరలు పడిపోయినప్పుడు వాటిని ప్యాక్ చేసి, సాసులు, పౌడర్, చట్నీలు చేయడానికి ఈ క్లస్టర్ ఎంతో ఉప యోగకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లా పరిధిలోని మార్కెట్ల నుండి ఏటా 190 టన్నుల కూరగాయలు, పండ్లు వ్యర్థమ వుతున్నాయని, ఈ వ్యర్థాన్ని అరికట్టడానికి కూడ సహయకరం గా మారుతుందన్నారు. దీనికి సూక్ష, చిన్న తరహా పరిశ్రమల శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నీరజ గాంధీ, ఎన్ఐ ఎంఎస్‌ఎంఈ అధికారి సూర్య ప్రకాష్ గౌడ్, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో అక్రమ డొనేషన్లను అరికట్టాలి

### గోదా అరుణ్ యాదవ్ డిమాండ్

**మేడ్చల్, మే 25, ప్రభాతవార్త ః** ప్రైవేట్ ఇంజనీరింగ్, వృత్తి విద్యా కోర్సుల కళాశాలల్లో జరగుతున్న అక్రమ డొనేషన్లను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు గోదా అరుణ్ యాదవ్ డిమాండ్ చేశాడు. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబిఎ, ఎంసిఏ తదితర వృత్తి విద్యా కోర్సుల్లో మేనేజ్మెంట్ సీట్లతో పాటు కన్వీనర్ కోటా సీట్లను కళాశాలలు లక్షల్లో డొనేషన్‌లను వసూలు చేస్తున్నాయని ఆరోపించాడు. కళాశాల స్థాయిని బట్టి రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వసూలు చేస్తున్నాయని, వాటిని ఉన్నత విద్యామండలి అధికారులు అరికట్టాలని కోరాడు. కన్వీనర్ కోటా సీట్లలో కూడ స్లైడింగ్ చేస్తూ సీట్లను మిగుల్చుకుని అమ్ముకుంటున్నాయని, ఇలా అమ్ముకోవడం చట్ట విరుద్ధమని అన్నాడు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని డొనేషన్ల అక్రమాన్ని అరికట్టాలని డిమాండ్ చేశాడు.

## విత్తనాల కొనుగోలు పట్ల జాగ్రత్తలు పాటించాలి

**కేశంపేట మండల వ్యవసాయ అధికారి శిరీష్**

**కేశంపేట, మే25,ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని రైతులకు విత్తనాల కొనుగోలుపై మండల వ్యవసాయ అధికారి శిరీష పలు రకాల సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేట ప్పుడు లైసెన్స్ కలిగి ఉన్నడీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని లూజుగా ఉన్న సంచుల విత్తనాలను అసలే కొనవ ద్దని అన్నారు. కొన్న విత్తన ప్యాకెట్లకి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని అదేవిధంగా విత్తనాల ప్యాకెట్లను వాటిపై ఉనన రకాన్ని చూడా ఖచ్చితంగా గమనించుకోవాలని ఒకటికి రెండు సార్లు అవి సరైనవా కాదా సరిచూసుకోవాలని ఆమె రైతులక చూచించారు. రైతులకు ఎవరైనా కల్తీ విత్తనాలను అమ్మ రైతులను పక్కదారి పట్టించి మోసం చేస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వారి షాపులను కూడా సిజ్ చేస్తామని ఆమె తెలిపారు. కేశంపేట మండలకేంద్రం తోపాటు మండల పరిధిలోని అల్వాల, ఇప ్పలపల్లి, బోదునం పల్లి బైర్ఖాన్‌పల్లి నిడుదవెల్లి గ్రామాలలో శనివారం రైతులకు విత్తనాల కొనుగోలుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్ర మంలో ఆయా గ్రామాల రైతులు మరియు వ్యవసాయ విస్తరణ అధికా రులు వినయ్ సుధా లలిత సంయుద్దీన్ సమీనా ప్రశాంత్ పాల్గొన్నారు.

## బషీరాబాద్‌లో నకిలీ విత్తనాల పట్టివేత

### ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

### సుమారు 415కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం

**తాండూరు, మే 25, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలంలో అధికారులు పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని సుమారు 415కిలోల నకిలీ విత్తనాలను స్వాదీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇందుకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎక్మాయి గ్రామంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం మేరకు శనివారం బషీరాబాద్ ఎస్ఐ రమేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి వెన్నెల సూర్య ప్రకాష్ సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులుకర్ణాటక రాష్ట్రం మదికంటి గ్రామానికి చెందిన వి. విఠలప్ప, దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములు అనుమానాస్పదంగా వారి చేతుల్లో రెండు విత్తనాల సంచులతో కలనిపించారు. వారి వద్ద పరిశీలించగా నకిలీ విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు వారిని విచారించగా దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములు దగ్గరి నుండి నకిలీ పత్తి విత్తనాలను తీసుకువచ్చి బషీరాబాద్ మండలంలో అమాయన రైతులకు విక్రయి స్తున్నట్లు అంగీకరించారు. ఈ మేరకు వారి వద్ద నుండి సుమారు 415 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాదీనం చేసుకొని సీజ్ చేయడంతో పాటు కర్ణాటక రాష్ట్రం మదికంటి గ్రామానికి చెందిన వి. విఠలప్ప, దౌల్తాబాద్ మండలం ఈర్లప ల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేత : కమిషనర్



అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

హయత్‌నగర్, మే 25 ప్రభాతవార్త: నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చేపడుతన్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కేంద్రంలో నిర్మించిన పలు అక్రమ నిర్మాణాలను శనివారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈసందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలకు ఇప్పటికే నోటీసులు అందించామని వాటిని సైతం త్వరలోనే కూల్చివేస్తామన్నారు. పసుమాములలో రోడ్డుకు అడ్డంగా తీసిన పునాదిని సైతం పూడ్చివేశారు.

## ఆర్‌ఎంపి, పిఎంపి సమస్యలను పరిష్కరించాలి : పారా మెడికల్ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, పీటర్ తదితరులు

తుర్కయాంజాల్, మే 25 ప్రభాతవార్త: తెలంగాణ కమ్యూనిటీ పారా మెడికల్ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయములో శనివారం సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ఆర్‌ఎంపి, పిఎంపి సమస్యలపై చర్చించి గత 2 నెలల నుండి ఆర్‌ఎంపి, పిఎంపి వైద్యులపై నకిలీ వైద్యులు అని దాడులు చేస్తున్న నేపథ్యంలో ఆర్‌ఎంపి, పిఎంపి రాష్ట్ర అధ్యక్షులు ఉక్కల అశోక్ మాట్లాడుతూ ఆర్‌ఎంపి,పిఎంపిలను నకిలీ వైద్యులుగా పిలుస్తూ వారిని అవమానపరుస్తూ వారి గౌరవాన్ని కించపరుస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని ఆర్‌ఎంపి, పిఎంపిపై దాడులను వెంటనే ఆపివేయాలని ఆర్‌ఎంపి, పిఎంపిలకు గత కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో దివంగత సిఎం వై.యస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్‌ఎంపి, పిఎంపిలుగా గుర్తించి 2008లో ఆర్‌ఎంపి, పిఎంపిల శిక్షణ నిమిత్తం జి.ఓను విడుదల చేసారు. దాని ఆధారంగా ప్రబుత్వము ఆర్‌ఎంపి, పిఎంపిలకు ప్రభుత్వ జిల్లా హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రిలో 1000 గంటల శిక్షణచ్చి వారికి గుర్తింపు కార్డులు అందజేసారు. వైఎస్సార్ అకాల మరణంతో శిక్షణ మధ్యలో ఆపివేసి నకిలీ వైద్యులుగా ముద్రిస్తున్న వారిపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిలకు విన్నవించి మాపై జరుగుతున్న దాడులను నిలిపివేసి, జి.ఓను వెంటనే అమలు చేసి ఆర్‌ఎంపి, పిఎంపి గుర్తింపు కార్డులు ఇచ్చి, శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చి, జీవనోపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఏఐవైఎఫ్



వినతిపత్రం అందజేస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్, మే 25 ప్రభాతవార్త: సైదాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలను మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల అమ్మకాలను అరికట్టాలని, ఫీజుల నియంత్రణకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ శుక్రవారం సైదాబాద్ మండల ఉప విద్యాధికారికి వినతపత్రం అందజేశారు.

## సైదాబాద్ కృష్ణానగర్'కారుణ్య సింధు'లో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

సైదాబాద్, మే 25 ప్రభాతవార్త: సైదాబాద్ కృష్ణానగర్‌లోని కారుణ్య సింధు ఆశ్రమంలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్నట్లు అధ్యక్షులు కదారి సత్యమూర్తి, కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వర రావు, కోశాధికారి రాజపేట సత్యనారాయణలు తెలిపారు. ప్రతి ఆదివారం ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు ఉంటాయని, జూన్ 8వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని, జూన్ 5వ తేదీ లోగా ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

## ప్రజల సంక్షేమానికి కృషి : షేక్ అక్బర్



షేక్ అక్బర్‌ను సన్మానిస్తున్న ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సొహైల్

మలక్‌పేట, మే 25 ప్రభాతవార్త : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి షేక్ అక్బర్ పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లోని రజక భవనంలో జరిగినకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మలక్‌పే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి తోడ్పడుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యపరుస్తామని తెలిపారు. అంతకుముందు ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సొహైల్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోనగిరి చంద్రశేఖర్, బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, దన్వంత్, చిగురు బాలరాజ్, అశ్ఫాఖ్‌ఖాన్, గంట్ల కృష్ణ, జాఫర్, మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



సబితా ఇంద్రారెడ్డిని సన్మానించిన చైర్మన్ రాజుగౌడ్ దంపతులు

సరూర్‌నగర్, మే 25 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్ హనుమాన్ దేవాలయం ఏడవ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ దిండు భూపేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెను ఆలయ చైర్మన్ దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముదావత్ దుర్గదీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మాజీఎంపిటిసి దిండు ప్రేమ రాజుగౌడ్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ నాయక్, నాయకులు పి.రాజ్‌కుమార్, ఆర్.మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా వేసిన బోర్‌ను సీజ్ చేసిన మల్కాజిగిరి రెవెన్యూ సిబ్బంది



నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోరును సీజ్ చేస్తున్న దృశ్యం

నేరేడ్‌మెట్, మే 25 ప్రభాతవార్త : అనుమతి లేకుండా బోర్లువేస్తే కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి తహసిల్దార్ సీతారాం మూర్తి హెచ్చరించారు. శుక్రవారం మౌలాలి డివిజన్‌లోని సాయినాథపురంలో ఒ వ్యక్తి వెయ్యి గజాల స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండా గురువారం ఉదయం నుంచి ఆరున్నర కమర్షియల్ బోరు వేస్తున్నాడు. ఎటువంటి బద్రతా చర్యలు తీసుకోకుండా బోరు వేస్తుండటంతో రెండురోజులుగా దుమ్ము, ధూళితో స్థానికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దీంతో స్థానికప్రజలు మల్కాజిగిరి తహసిల్దార్ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. గిర్దావరి శ్రీశైలంను సంఘటనా స్థలానికి పంపించారు. అనుమతి లేకుండా వేస్తున్న బోర్వెల్‌ను వారు సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా బోర్లు తవ్వితే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్, మే 25 ప్రభాతవార్త : ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 11 కెవి మెట్రో పీడర్ పరిధిలోని ఐడిఏ పరిధిలోని ప్రజాతంత్ర, ఎల్ఐసి భవనం, శ్రీ సాయికాలనీ, మెట్రో రోడ్, నీలిమ అర్గానిక్స్, విహెచ్ ఆర్గో, వోడాఫోన్, టెనెక్స్, లక్ష్మినారాయణకాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా, శ్రీ కృష్ణ ఫార్మ, శ్రీ సాయి గ్రానైట్స్, అజంత హోటల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు. అదే విధంగా 11 కెవి పెర్రో కాస్ట్ పరిధిలోని పెర్రో కాస్ట్, బాబా ఇంజనీరింగ్, చర్చికాలనీ, మురుగన్ కంపెనీ, శ్రీవాణికంపెనీ, అను ప్రింటర్స్, హైదరాబాద్ సెక్యూరిటిస్, మధు పుడ్స్, నామాద్రి, రికాన్ ఫార్మా, నుస్రత్ మెటల్స్, రికాన్ పార్మా తదితర ప్రాంతాల్లో సాయంత్రం 3 గంటలనుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే కఠిన చర్యలు : డిసి ఆంజనేయులు

ఉప్పల్, మే 25 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలో జివిపి పాయింట్స్ తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని డిసి అంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది, మహిళ సంఘాల ప్రతినిధులతో కలిసి ప్రజలకు జివిపి పాయింట్‌ల వద్ద చెత్త వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రాజ్ ఆదేశాల మేరకు జూన్ రెండో తేది వరకు ప్రతి సర్కిల్‌లో జివిపిపాయింట్‌లు తొలగించి చెత్త ఆటోలకు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంటి యజమానులు, దుకాణదారులు విధిగా చెత్త ఆటోలు చెత్త అందించాలని, జూన్ రెండో తేది వరకు జివిపిలు లేకుండా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చిరు వ్యాపారుల నుంచి చెత్తసేకరించేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు చెత్త ఆటోలకు డబ్బులు చెల్లించాలని సూచించారు. వర్షాకాలంలో ఒపెన్ నాలాలలో చెత్త వేయకుండా చూడాలని కోరారు. స్వచ్ఛ హైదరాబాద్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి : గీత

ఉప్పల్, మే 25 ప్రభాతవార్త : చిలుకానగర్ డివిజన్ సాయిరాంనగర్‌కాలనీ, గణేష్‌నగర్‌లో సివరేజీ పైప్‌లైన్ పనులు యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలో జలమండలి అధికారులు, కాలనీ సంఘం నేతలతో కలిసి ఆమె పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ ఎన్నికల కారణంగా ఆలస్యం అయిన పనులను తక్షణమే పూర్తి చేయాలని, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, నారాయణరెడ్డి, సదానందచారి, కాలనీ సంఘం నేతలు వెంకటేశ్వర్లుగుప్త, సీతారామచారి, అశోక్‌రెడ్డి, మల్లారెడ్డి, నరసింహా, యాదయ్య, బుచ్చిరెడ్డి, జగదీష్, సుధాకర్‌రెడ్డి, ఇందిర, పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైద్రాబాద్ చేరుకున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికారు. (సైదాబాద్, ప్రభాతవార్త)

## ఉప్పల్ భూ నిర్వాసితులకు సమాన పరిహారం ఇవ్వాలని వినతి : ఎంపిఆర్



ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డిని కలిసిన పరమేశ్వర్‌రెడ్డి, భూనిర్వాసితులు

ఉప్పల్, మే 25 ప్రభాతవార్త : ఉప్పల్ ప్రధాన రహదారిలో ఆస్తులు కోల్పోయిన భూయజమానులకు సమాన పరిహారం ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ ప్రధాన రహదారిలో ఆస్తులు కోల్పోయిన భూయజమానులకు జిహెచ్‌ఎంసి పరిహారం చెల్లించిందని, అయితే పరిహారం చెల్లింపులో జిహెచ్‌ఎంసి బిన్న వైఖరి ప్రదర్శిస్తుందని తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారికి తక్కువ పరిహారం ఇచ్చారని, ఇతరులకు అధికంగా ఇచ్చారని తెలిపారు. దీనిపై న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భూయజమానులు కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్, పూజల ప్రభాకర్, తిక్క ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలో పీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి : ఎఐవైఎఫ్




ప్రైవేటు పాఠశాలలో నిబంధనలకు అమలు చేయాలని ఆందోళన చేస్తున్న ఎఐవైఎఫ్ నేతలు ధర్మేంద్ర తదితరులు

ఉప్పల్, మే 25 ప్రభాతవార్త : ప్రైవేటు పాఠశాలలో పీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా సమితి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జివో నెం.1కు విరుద్ధంగా పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ తదితరులు మాట్లాడుతూ జివోనెం.1లో నిబంధనల ప్రకారం పీజులు, పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, టై, బెల్ట్ తదితర వాటిని విక్రయించరాదని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టాలని కోరారు. కుషాయిగూడలోని గౌతమి మాడల్ స్కూల్ గదిని కాప్రా విద్యాశాఖ అధికారులు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, కిరణ్, సతీష్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ప్రభుత్వ సహకారం



లబ్దిదారుడికి సిఎంఆర్ఎఫ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మే 25 ప్రభాతవార్త : సిఎం సహాయనిధి పథకం పేదలకు ఒక వరం లాంటిదని, అర్హులైన పేదలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రామంతాపూర్ డివిజన్ శ్రీరామకాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి నిమ్స్‌లో చికిత్స పొందుతుండడంతో ఆయనకు రూ.45వేల ఎల్‌ఓసి చెక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్‌కు తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. బిఆర్ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు విజ్ఞప్తి మేరకు లబ్దిదారుడిని చేయూత అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్ సిపిఎం కార్యదర్శిగా జె.వెంకన్న

ఉప్పల్, మే 25 ప్రభాతవార్త : ఉప్పల్ సిపిఎం కార్యదర్శిగా జె.వెంకన్న నియమితులైయ్యారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింగ్‌రావు, జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, ఎం.వినోద తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కార్యదర్శిని ఎన్నుకుంటూ నిర్ణయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జె.వెంకన్న మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజల కోసం పనిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎం.అశోక్‌రెడ్డి, ఎం.డి.గౌస్, భీష్మాచారి, జె.లలిత, ఎం.కిరణ్, శేషు, వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ గౌడ సహకార సంఘం అధ్యక్షునిగా గిరుకటి కృష్ణంరాజుగౌడ్



ఏకగ్రీవంగా ఎన్నికైన బాలాపూర్ గౌడ సహకార సంఘం కార్యవర్గం

సరూర్‌నగర్, మే 25 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ గౌడ సహకార సంఘం నూతన అధ్యక్షునిగా గిరుకటి కృష్ణంరాజుగౌడ్ ఎన్నికయా్యరు. ఆయనతో పాటు ఉపాధ్యక్షునిగా ముప్పిడి ధన్‌రాజ్‌గౌడ్, డైరెక్టర్లుగా తూళ్ళ మల్లేష్‌గౌడ్, జూకంటి సురేష్‌గౌడ్, రంగ నాగేశ్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఎక్సైజ్ కో-ఆపరేటివ్ ఆపరేటర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో గౌడ సహకార సంఘానికి ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా బాలాపూర్ గౌడ సహకార సంఘం సభ్యులు నూతన అధ్యక్షునిగా కృష్ణంరాజుగౌడ్‌ను, ఉపాధ్యక్షునిగా ముప్పిడి ధన్‌రాజ్‌గౌడ్‌ను, డైరెక్టర్లుగా తూళ్ళ మల్లేష్‌గౌడ్, జూకంటి సురేష్‌గౌడ్, రంగ నాగేశ్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన అధ్యక్షుడు కృష్ణంరాజుగౌడ్ మాట్లాడుతూ తమ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన గౌడ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బాలాపూర్ గౌడ కులస్తుల సంక్షేమానికి తాము కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

ఉప్పల్, మే 25 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నృత్య ఆశ్రిత కూచిపూడి డాన్స్ అకాడమీ గురువు ఆశ్రిత కిశోర్ శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వినాయక కౌతం, తక్కువేమి మనకు, జయదేవ, అష్టపది, కృష్ణం కలయ సఖి, నృసింహ కవచం, శివ లీలలు తదితర అంశాలను శాన్విరెడ్డి, నిధి, హంసిక, అద్విత, శ్రీకరి, సాహితి, సమ్రిది, ఈషా, సమన్వి, స్ఫూర్తి తదితరులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## భవానినగర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సన్మానించిన కార్పొరేటర్



కార్పొరేటర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

నాచారం, మే 25 ప్రభాతవార్త : నాచారం డివిజన్ పరిధిలోని భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌ను శుక్రవారం కలిసి కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతి ప్రతాన్ని అందజేశారు. భవానినగర్‌లో డ్రైనేజీ, రోడ్ల సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అందుకు కార్పొరేటర్ సానూకులంగా స్పందించారు. అనంతరం నూతన కమిటిని కార్పొరేటర్ శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచెర్ల మధుసూధన్ రెడ్డి, వై.సత్యనారాయణ, సిహెచ్, కృష్ణారెడ్డి, డి.ఆనంద్‌కుమార్, భవాని అశోక్, రాయుడు, కె.శ్రీధర్ రెడ్డి, జవ్వాజి శ్రీధర్ రెడ్డి, సురేందర్, వీరప్రతాప్ రెడ్డితో పాటు డివిజన్ అధ్యక్షులు మేకల ముత్యం రెడ్డి, నాయకులు సాయిజన్ శేఖర్ తధితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో ఆంజనేయస్వామి స్వాముల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



అంజనేయస్వామి స్వాముల ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్లు చేతన, శ్రీవాణి

ఉప్పల్, మే 25 ప్రభాతవార్త : రామంతాపూర్‌లో అంజనేయస్వామి స్వాముల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారు శ్రీవాణి, బిజెపి నేత గడ్డం సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అంజనేయస్వామి స్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. అంజనేయస్వామి భక్తులు తన వంతు సహకారమందిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా రామంతాపూర్ పాండు రంగస్వామి ఆలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా అధ్యక్షురాలు రాగి లతారెడ్డి, అంజనేయస్వామి ట్రస్ట్ సభ్యులు మంచాల వీర ప్రకాష్, రాగి వెంకట్‌రెడ్డి,దంతూరి భాస్కర్, తీగల మహేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, మోర్ల సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్‌చారి, వెంకటేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## జానకి ఎన్‌క్లేవ్ శ్రీ శివరామ క్షేత్రం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం



శ్రీ శివరామ క్షేత్రం నూతన పాలక మండలి సభ్యులు

సైదాబాద్, మే 25 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్ జానకి ఎన్‌క్లేవ్‌లోని శ్రీ శివరామ క్షేత్రం దేవాలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షురాలుగా మనుసాని రమ, ఉపాధ్యక్షులుగా ఎం.రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జూలూరు శంకర్, కోశాధికారిగా బి.గోవర్ధన్, సంయుక్త కార్యదర్శిగా మాధవి జోషి ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయ సలహాసంఘం గౌరవ అధ్యక్షులుగా కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, గౌరవ సభ్యులుగా లక్ష్మారెడ్డి, జూలూరు ఈశ్వరయ్య, జి.దామోదర్‌రెడ్డి, వెంకటేష్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జానకి ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కె.వెంకటయ్య, మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి మధుసూధన్ చారితో పాటు మనుసాని శ్రీనయ్య, హన్మంత్‌రెడ్డి, వాయు నందన్ తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ రామకృష్ణ

కుషాయిగూడ, మే 25 ప్రభాతవార్త : మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ విద్యుత్ ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు. కుషాయిగూడ పద్మావతి 11కె.వి ఫీడర్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియా పద్మావతి కాలనీ, కమల టవర్స్, పోచమ్మ టెంపుల్ ఏరియా, కుషాయిగూడ మెయిన్ రోడ్, టాటా మోటార్స్ ప్రాంతాలలో ఉదయం 11 గంటలకు 12 గంటల 30 నిమిషాలవరకు, 11 కెవి కుషాయిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల నుండి 2 గంటల వరకు కుషాయిగూడ సబ్ స్టేషన్ నార్త్ కమలానగర్, ఏపీఐఐసీ కాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా, పెద్ద బోర్‌వెల్ ఏరియా, తులసి హాస్పిటల్ ప్రాంతాల్లో, అదేవిధంగా 11కెవి నాగార్జుననగర్ కాలనీ, టెంపుల్ ఫీడర్ పరిదిలో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, ఇండస్ట్రియల్ క్యాంటీన్ ఏరియా,సీతారాంనగర్,వెంకటేశ్వరస్వామి టెంపుల్ ఏరియా, శశికాంత్‌నగర్, షటిల్ కోర్ట్ ప్రాంతాల్లో, 11 కె.వి సాయిబాబానగర్ టెంపుల్ ఫీడర్ పరిధిలోని కుషాయిగూడ, ఈసీఐఎల్ రింగ్ రోడ్, ఇండస్ట్రియల్ ఏరియా, జీనియ హాస్పిటల్ ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల నుండి 5 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.